క్లుప్తంగా

మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా 'పేట'

నారాయణపేట రూరల్: నారాయణపేటను మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. సుప్రీం కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం మాన్యువల్ స్కావెంజర్స్ జిల్లా స్థాయి సర్వే కమిటీ ఈనెల 1న సమావేశమై విధివిధానాలపై చర్చించి జిల్లాలోని అన్ని గ్రామ, మున్సిపాలిటీ స్థాయిలలో, రైల్వే మొదలగు సంస్థలలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి స్థాయి నివేదిక ఈనెల 14న అందగా నివేదికలో జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజింగ్ పని చేయటం లేదని వెల్లడైనట్లు వివరించారు. దీంతో జిల్లాను మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాగా ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మరికల్: స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది, బీజేపీ అధికార ప్రతినిధి రఘువీర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. ఆర్టికల్ 243 కింద ప్రభుత్వానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే అధికారం ఉందన్నారు. ఒకవేళ 42 శాతం రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలను ప్రకటిస్తే బీసీల తరఫున తమ పార్టీ పోరాటం సాగిస్తుందన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం



నారాయణపేట రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు స్వీయ రక్షణ ఎంతో అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండా సత్య యాదవ్, తస్మా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టులను ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా కొండా సత్య యాదవ్, సుదర్శన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి ఆడపిల్లలు తమని తాము రక్షించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్లాక్, బ్రౌన్ బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రాఘవరెడ్డి, రవికుమార్ గౌడ్, మాస్టర్లుపాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనుల కేంద్రాలకు వెళ్లి ఈనెల 30న కలెక్టరేట్‌ల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కూలీలను కోరారు. రోజువారి కూలిని రూ.600 పెంచాలని, ఏడాదిలో 210 దినాలు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో నరహరి, తాయప్ప, నారాయణ, నర్సప్ప, వెంకటేష్, నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

దామరగిద్ద: మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గ్యాంగ్ హన్మంతు కోరారు. కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న వారి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఒకే కుటుంబం నుంచి ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండి ప్రజా జీవితంలో ముందుకు సాగుతున్న మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వివేక్ మంత్రి పదవి కేటాయించి తగిన గుర్తింపు అందించాలని కోరారు.

భవానీ మందిర్‌లో కులగురువుకు సన్మానం

ఊట్కూరు: ఊట్కూరులోని భవానీ మందిర్‌లో గురువారం ఎస్ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో వారి కులగురువు ప్రకాశ్‌రాజ్ భట్టు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కులవంశ వృక్షం గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చౌదరి అశోక్, వెంకట్రావు, నాగేశ్వర్‌రావ్, వినాయకరావ, జీవన్‌రావు పాల్గొన్నారు.

బాలికలకు వరం 'కస్తూర్బా'



కృష్ణా మండలంలోని కస్తూర్బా విద్యాలయం

- ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్న బాలికలు
- పదేళ్లలో బాలికల చదువుల్లో గణనీయమైన మార్పులు

కృష్ణా: కృష్ణా మండలం అంటేనే జిల్లాలోనే ఓ విశిష్టత కల్గిన మండలంగా గుర్తింపు పొందింది. ఇక్కడి ప్రజల జీవనశైలి ప్రధానంగా ఇక్కడ మాట్లాడే భాష కన్నడం కావడంతో ఈ ప్రాంత పేద విద్యార్థులకు ప్రాధాన్యమిస్తూ మండలంలో 2017లో ప్రభుత్వం కస్తూర్బా బాలికల పాఠశాలను ఏర్పాటు చేసింది. అప్పుడు 50 మంది విద్యార్థినులతో ప్రారంభమైన పాఠశాల ఇప్పుడు 367 మందితో కొనసాగుతుంది. పాఠశాలతో పాటు కళాశాల కూడ రావడం ఈ ప్రాంత బాలికలు చదువుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ఒకప్పుడు విద్యార్థినులను పాఠశాలకు పంపించాలని కోరుతూ గ్రామాల్లో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించేవారు. ఇప్పుడు పరిస్థితిలో చాలా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా తల్లిదండ్రులకు ఈ పాఠశాలలోని ఉపాధ్యాయులు, వారు బోధించే చదువు, ఉత్తీర్ణత, అక్కడ తమ పిల్లలకు లభించే రక్షణ, భోజనం, వసతులు ఇలా చాలా అంశాలు ప్రభావం చూపడంతో పాఠశాలలో చేరే విద్యార్థినుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. 2020లో 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏటా 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే విధంగా ఈ మండల ప్రజల బాలికల చదువులు దాదాపు 90 శాతం 10వ తరగతి వరకే కొనసాగించి పై చదువులకు వెళ్లే వారు కాదు.ఈ విషయంను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి మేరకు ఈ పాఠశాలకు 2021లో కళాశాలను కూడ మంజూరు చేశారు. ఇప్పుడు ఈ కళాశాలలో కూడ మొత్తం 160 మంది విద్యార్థినులు చదువుతున్నారు. కళాశాల కూడా ఏటా 80–90 శాతం ఉత్తీర్ణత సాధిస్తుండడంతో తమ పిల్లలను ఈ కాలేజీలో చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కస్తూర్బా పాఠశాలలో తెలుగు, బొటనీ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఏఎన్ఎం, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ప్రభుత్వం భర్తీ చేస్తే మరింత మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు అవకాశం ఉంటుంది.

సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులను ప్రారంభించాలి

ప్రస్తుతం కస్తూర్బా కళాశాలలో కేవలం సైన్స్ గ్రూపులు మాత్రమే కొనసాగిస్తున్నారు. ఆర్ట్స్ గ్రూపులు లేనందున ఈ ప్రాంత విద్యార్థులు సీఈసీ, హెచ్ఈసీలో చేరాలంటే అవకాశం లేకుండ పోయింది. ప్రభుత్వం ఆర్ట్స్ గ్రూపులను కూడా ప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం అడ్మిషన్లు

ఒకప్పుడు ఇక్కడ అడ్మిషన్లు తక్కువగా ఉండడంతో ఈ మండలం విద్యార్థినులు కాకుండగా సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఇక్కడ అడ్మిషన్లు పొందేవారు. ప్రస్తుతం ఇక్కడ బాలికలు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఇక



వేరే మండలం వారికి అవకాశం కల్పించడం లేదు. దీంతో అడ్మిషన్ల కోసం పలువురు ప్రజాప్రతినిధులతో సిఫారుసులు చేస్తుండడం విశేషం. వంద ఉత్తీర్ణత శాతంతో నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో ఏటా పాఠశాలతో కూడా కళాశాలలో కూడా సీట్లన్నీ భర్తీ అవుతున్నాయి. క్రమ శిక్షణ, ఉపాధ్యాయుల అంకిత భావమే తమ విజయ రహస్యం. అలాగే ప్రస్తుతం కళాశాల భవనం కూడ పూర్తి కావడంతో విద్యార్థులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఏర్పడింది.

– శాలిని, ఎస్ఓ, కృష్ణా మండలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని మార్కెట్ లైన్ ప్రభుత్వ పాఠశాలలో 1996–97 బ్యాచ్ టెన్త్ క్లాస్ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపికాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరి గురించి ఒకరు తెలుసుకొని ఆనందంగా గడిపారు. అలాగే తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులని సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకొన్నారు. ఇకముందు మిత్రులందరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.

గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో శివకుమార్

మాగనూర్: కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న రైతు గుర్తింపు కార్డు కోసం మండలంలోని రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఈవో శివకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మాగనూర్ మండలంలోని ఓబ్లాపూర్ గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక గ్రామ పంచాయతీలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం ఈ గుర్తింపు కార్డు తప్పనిసరి అని తెలిపారు. రైతులు పట్టాదారు పాసుబుక్ నెంబర్‌కు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌ను లింక్ చేసుకోవాలన్నారు. రైతులు స్థానిక ఏఈవోల వద్ద గాని లేదా మీ సేవా కేంద్రాలలో గాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒక వేళ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే పీఎం కిసాన్ నిధి డబ్బులు పడవని సూచించారు.

చేపల పెంపకంతో అధిక ఆదాయం



చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మరికల్: రైతులు కొరమీను చేపల పెంపకంతో అధిక ఆదాయం ఆర్జించవచ్చని ఏఓ రహ్మాన్, సూర్యచంద్ర, రామ్‌కీ ఫౌండేషన్ అధినేతలు సూర్యమోహన్‌రెడ్డి, మహేంద్ర అన్నారు. మరికల్‌లో గురువారం 150 మంది రైతులకు సూర్యచంద్ర, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ వారి సహకారంతో నాలుగు గుంటల స్థలంలో రూ.4.40 లక్షలతో ఇందులో 35 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఇంటిగ్రేటెడ్ చేపల షెడ్ నిర్మాణం చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూర్యచంద్ర ఫౌండేషన్ చైర్మన్ సూర్యమోహన్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ రమేష్ రాథోడ్, వీరన్న, విజయ్ రెడ్డి, హరీష్, సత్యన్న, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, రాజు పాల్గొన్నారు.

రైతులకు రవాణా డబ్బులు చెల్లించాలి

నర్వ: వరి ధాన్యం అమ్ముకున్న రైతులకు రవాణా డబ్బులను వెంటనే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు సకాలంలో ధాన్యం విక్రయించేందుకు లారీలను పంపించకపోవడంతో సొంతంగా ట్రాక్టర్‌లను ఏర్పాటు చేసుకోవడంతో అదనపు ఖర్చు అయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే రైతులకు రవాణా డబ్బులను ఇప్పించి ఆదుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

ఆత్మకూర్: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు తప్పవని పురపాలిక కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం స్థానిక దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. ప్లాస్టిక్ వాడిన, అమ్మిన చర్యలు తప్పవని దుకాణాదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పురపాలిక సిబ్బంది ఉన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కృష్ణా: కృష్ణానదికి ముందస్తుగా భారీగా వరద వస్తుండటంతో వాసునగర్, హిందూపూర్ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పుష్పలత హెచ్చరించారు. గురువారం ఆమె, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి నదిలో వరద ఉధృతిని పరిశీలించి మాట్లాడారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని వదులుతుండటంతో వరద ఎప్పుడు పెరుగుతుందో తెలియదని.. ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా.. ఎప్పుడూ ఆగస్టులో వచ్చే వరద ఈ ఏడాది ముందుగా రావడంతో నదీతీర ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు త్వరగా ప్రారంభించేందుకు అనుకూలమని, నదీతీరంలో వరి నారుమడులు వేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తపల్లి: మండలంలో ని లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జయరాములు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యాక్రమం ప్రారంభం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

మద్దూరు: మండలంలోని లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డిలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 151 మందికి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. పట్టణ శివారులోని రైతు వేదిక దగ్గర శుక్రవారం ఉదయం 10 గంటలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని లబ్ధిదారులు, సిబ్బంది సమయానికి హాజరు కావాలని సూచించారు.

5 లక్షల బస్తాల వరి ధాన్యం కొనుగోలు

నర్వ: సింగిల్ విండో ఆధ్వర్యంలో ఈ సీజన్‌లో అత్యధికంగా వరి ధాన్యం కొనుగోలు చేశామని, ఇందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. 2 వేల మందికి పైగా రైతుల నుంచి దాదాపు 5 లక్షల బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు.

రవాణా డబ్బులు ఇప్పుడు గుర్తుకొచ్చాయా..?

రైతులకు రవాణా డబ్బులు చెల్లించాలని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి డిమాండ్ చేయడంపై పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. అతను చైర్మన్‌గా ఉన్నప్పుడు రైతులకు రవాణా డబ్బులు ఇవ్వాలన్న ధ్యాస రాలేదా అని ప్రశ్నించారు. రైతులపై ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్న లక్ష్మీకాంత్ రెడ్డి ఆనాడు ఎందుకు ఇవ్వలేదన్నారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యేలను లాగడం ఎంత వరకు సమంజసమన్నారు. రైతులకు ఎల్లప్పుడు పాలకవర్గం అండగా ఉంటుందన్నారు.

రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలి

ఊట్కూరు: ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఊట్కూరులో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఇప్పటి వరకు రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. అలాగే వరి ధాన్యానికి సంబంధించిన బోనస్ రూ.500 రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్, నాయకులు హనుమంతు, రమేష్, కృష్ణగౌడ్, రఘువీర్, ఆశప్ప, నవీన్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'ను అమలు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంత్

నారాయణపేట ఎడ్యుకేషన్: రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేలు ఇవ్వాలని ఏఐకేఎమ్ఎస్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కానీ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందన్నారు. రైతులకు రూ.12,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 1 నుంచి 15 వరకు తహసీల్దార్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎమ్ఎస్ ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, జిల్లా సహాయ కార్యదర్శి ఆజి మాలన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండల పరిధిలోని మన్నాపూర్–అల్లీపూర్ మధ్యలో రూ.9 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల రూ.9 కోట్లు సీఆర్ఆర్ నిధులు మంజూరు కావడంతో బ్రిడ్జితో పాటు మండల కేంద్రంలో సమీకృత మండల కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా రవాణాకు ఇబ్బందులు కలగకుండా వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీర్ జోగారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మన్నాపూర్, అల్లీపూర్, దుప్పటిగట్టు గ్రామాలతో పాటు నారాయణపేటకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్సీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ హీర్యా నాయక్, డీఈ విలోక్, అల్లీపూర్ మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఐ, సభ్యులు

నారాయణపేట రూరల్: బాల్య వివాహాల అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మీపతి గౌడ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ ఎల్ఎస్‌యూసీ కమిటీ సభ్యులు నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మీపతి గౌడ్ ఎస్ఐ వెంకటేశ్వర్లుతో మాట్లాడుతూ బాల్య వివాహాలు అలాగే అనాథ బాలలకు అందించే న్యాయ న్యాయ సహాయంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆశప్ప, బాలరాజ్, రూపిక, సత్య, సుకన్య, జ్యోతి పాల్గొన్నారు.

'చదువుతోనే ఉన్నత స్థానానికి చేరుకోగలం'



ప్రశంసాపత్రాలు, మెమొంటోలతో విద్యారులు

నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే చదువుతోనే సాధ్యమని ఎస్ఎస్‌కె సమాజ్ అఖిల్ వైస్ ప్రెసిడెంట్ నాగురావ్ నామాజీ అన్నారు. గురువారం స్థానిక అంబభవానీ మండల కార్యాలయంలో సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్, ఎంప్లాయీస్ అసోసియేషన్ దూల్పేట్ వారి ఆధ్వర్యంలో జిల్లాలో పదో తరగతి, ఇంటర్, ఐఐటీ, నీట్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులను చదువు పరంగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పరామర్శ



రాములు నాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మద్దూరు: మండలంలోని దేన్యానాయక్ తాండాకు చెందిన ఉపాధ్యాయుడు రాములు నాయక్ కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాములు కోస్గి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ కోస్గి యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేశారని ఆయన సేవలను కొనియాడారు. రాములు నాయక్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూసి వారి పిల్లల చదువులకు సహకరిస్తామన్నారు. పరామర్శించిన వారిలో యూటీఎఫ్ జిల్లా నాయకులు శివరాములు, శంకర్‌నాయక్, శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు అంజిలయ్యగౌడ్ ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ధన్వాడలోని విత్తనాల షాపులో అధికారుల తనిఖీ



మాగనూర్‌లోని ఓ ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న అధికారులు

మాగనూర్: నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని మాగనూర్ ఎస్ఐ అశోక్‌బాబు, ఇంచార్జి ఏఓ సుదర్శన్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం వారు మండలంలోని పలు సీడ్స్, ఫర్టిలైజర్ షాపులలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాగనూర్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

మద్దూరు: రైతులను నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మద్దూరు, కొత్తపల్లి మండలాల ఏఓలు రామకృష్ణ, రమేష్‌లు ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులను హెచ్చరించారు. గురువారం మద్దూరు పట్టణ శివారులోని రైతు వేదికలో స్థానిక ఎస్ఐ విజయ్‌కుమార్‌తో కలిసి షాపుల యజమానులకు విక్రయాలకు సంబంధించి చట్టాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనఖీల్లో స్టాక్ రిజిస్ట్రర్లు, బిల్ బుక్స్, ఇన్వాయిస్‌లు, విత్తనాల సోర్స్ సర్టిఫికెట్లు పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పని సరిగా గుర్తింపు పొందిన డీలర్ల వద్దే తీసుకోవాలని, సర్టిఫైడ్ లేదా నమ్మకమైన లేబుల్ విత్తనాలు ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల విత్తనాల విక్రయ షాపుల యజమానులు, ఏఈఓలు పాల్గొన్నారు.

రసీదులు తీసుకోవాలి

ధన్వాడ: నకిలీ విత్తనాలు అమ్మితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలో ఫెర్టిలైజర్ షాపులను పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఇన్వాయిస్‌లు, విత్తనాల సోర్స్ సర్టిఫికెట్లను పరిశిలించారు. రైతులందరూ విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పకుండా రశీదులు తీసుకోవాలని సూచించారు.

నారాయణపేట రూరల్: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు దుకాణాదారులను హెచ్చరించారు. వ్యవసాయ అధికారి దినకర్‌తో కలిసి గురువారం పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, లైసెన్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.